

ఉపాధికి 'షార్ట్' కట్
పాలిటెక్నిక్ కోర్సులు ఉపాధికి దోహదపడుతున్నాయి. ఈ కోర్సు చేసిన బాలికలకు షార్‌లో అవకాశాలొస్తున్నాయి.. 10లో



అర్ధరాత్రి తనిఖీలు..
చిత్తూరు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి ముమ్మరంగా తనిఖీలు జరిగాయి. 31 కేసులు నమోదు చేశారు.. 10లో



సమయస్ఫూర్తితో నివారించాలి
అగ్నిప్రమాదాలను సమయస్ఫూర్తితో నివారించాలని అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి పెద్దిరెడ్డి తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

హైదరాబాద్‌లో జాతీయ సాహిత్య పురస్కారాలు రేపు

పలమనేరు: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 20వ తేదీన జాతీయస్థాయి సాహిత్య పురస్కారాల కార్యక్రమం జరుగుతుందని పలమనేరు రచయితల సంఘం అధ్యక్షుడు పలమనేరు బాలాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ ట్రస్టు తరఫున జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీలో బహుమతులు పొందిన రచయితలకు పురస్కారాలు ప్రదానం చేస్తారన్నారు. దీంతోపాటు కథలతో కథాప్రపంచం, నవల సాక్షాత్కారం, లోపలేదో కదులుతున్నట్టు అనే మూడు పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుందని నిర్వాహకులు మలిశెట్టి శ్యాం ప్రసాద్ తెలిపారన్నారు. ఈ కార్యక్రమానికి సుప్రసిద్ధ సాహితీవేత్తలు వాడ్రేవు చిన వీరభద్రుడు, మాజీ ఐఏఎస్ అధికారి యాకూబ్, ఏకే ప్రభాకర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకులుగా పనిచేసిన దివంగతర మలిశెట్టి సీతారామ్ స్మారకార్థం ఏటా ఈ పురస్కారాలను అందిస్తున్న విషయం తెలిసిందే.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు



తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. బుధవారం అర్ధరాత్రి వరకు 56,279 మంది స్వామివారిని దర్శించుకోగా 24,019 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విద్యతోనే పేదరికం దూరం..అభివృద్ధి సాధ్యం అని నమ్మింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఆ దిశగా అడుగులు వేసింది. విద్యకు పెద్ద పీట వేసింది. విద్యాశాఖలో పెను మార్పులు చేసింది. సంస్కరణలు తీసుకొచ్చింది. పలు పథకాలు అమలు పరిచింది. పేద విద్యార్థులకు నాణ్యతతోకూడిన మెరుగైన విద్య అందింది. వారంతా క్రమశిక్షణతో చదివి, నేడు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి, మెరిశారు. ఇందంతా నాటి వైఎస్సార్ సీపీ సర్కారు సంస్కరణల ఫలితంగా సాధ్యమైందని, వారి ఆలోచన, ఆచరణ అ'ద్వితీయ'ం అని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు సంస్కరణలు.. నేడు అద్వితీయం

- గత ప్రభుత్వ సంస్కరణలతోనే నేడు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు
- సత్తా చాటిన సర్కారు విద్యార్థులు
- వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యకు అధిక ప్రాధాన్యత
- సన్‌షైన్ అవార్డులు స్వీకరించిన జిల్లా విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : పేదింటి పిల్లలు ప్రపంచంతో పోటీపడేలా, తరతరాల తలరాతలను మార్చాలని గత ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాశాఖలో సంస్కరణ విప్లవం తెచ్చింది. ఒక చదువుతోనే పేదరికాన్ని అధిగమించడం సాధ్యమని బలంగా విశ్వసించి ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థలో ఎన్నడూ లేని విధంగా గత ఐదేళ్ల పాటు అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఇంటర్ విద్యార్థులకు అమ్మఒడి, విద్యాకానుక, నాడు నేడు తదితర పథకాలను అమలు చేసి పేద విద్యార్థు ల ఉన్నత చదువులకు భరోసా కల్పించింది.

నాటి సంస్కరణలే..నేటి ఉత్తమ ఫలితాలు

వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో అమలు చేసిన సంస్కరణలే నేడు ఇంటర్మీడియట్ ఉత్తమ ఫలితాలకు దోహదం చేశాయి. జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లో 74 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసేందుకు పలు కార్యక్రమాలు గత ఐదేళ్లల్లో చేపట్టారు. ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి ఉండేది. గత సర్కారులో కాంట్రాక్ట్ లెక్చరర్ల డిమాండ్‌లు నెరవేర్చి, వారి జీతాలు సైతం పెంచారు. దీంతో ఆ లెక్చరర్లు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేశారు. పాఠశాల స్థాయి విద్యార్థులతోపాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు అమ్మఒడి పథకం అమలు చేసి ఆర్థిక సహాయం అందజేశారు. ఆ ఆర్థిక సహాయంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా తమ పిల్లలను సజావుగా చదివించుకున్నారు.

సన్‌షైన్ అవార్డులు స్వీకరించిన ఆరుగురు విద్యార్థులు

గత సర్కారులో ఉత్తమ విద్యాబోధన, విద్యాసంస్కరణతో ప్రస్తుతం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. జిల్లాలోని పలమనేరు టీకేసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న హర్షిత వొకేషనల్ గ్రూపులో 971 మార్కులు సాధించింది. కుప్పం ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో చదివిన సుస్మిత 976 మార్కులు, అదే కళాశాలలో శ్రీనివాసులు 952 మార్కులు, రొంపిచెర్ల కేజీబీవీలో సీఈసీ చదివిన శ్రవంతి 935, కుప్పం నడిమూరు మోడల్ స్కూల్‌లో సీఈసీ చదివిన అశ్విని 969 మార్కులు సాధించారు. ఈ ఐదుగురు విద్యార్థులు ఈ నెల 15వ తేదీన విజయవాడలో ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డులు, ల్యాప్‌టాప్ స్వీకరించారు.

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమాచారం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	31
మోడల్ స్కూల్స్	7
కేజీబీవీలు	8
హైస్కూల్ ప్లస్‌లు	28
మొత్తం కళాశాలలు	74
బాలురు సంఖ్య	13,868
బాలికల సంఖ్య	14,081
మొత్తం విద్యార్థులు	27,948

మేస్త్రీ పనులు చేస్తూ కుమార్తెను చదివిస్తూ..

జిల్లాలోని రొంపిచెర్ల కేజీబీవీ విద్యార్థిని శ్రవంతి ఇంటర్మీడియట్ ఫలితాల్లో 935 మార్కులు సాధించింది. సన్‌షైన్ అవార్డుకు ఎంపికై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు సైతం స్వీకరించింది. కర్నూలు జిల్లాకు చెందిన శివన్న, దేవమ్మకు ఇద్దరు కుమార్తెలు. శివన్న తిరుపతిలో మేస్త్రీ పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను చదివించుకుంటున్నారు. శ్రవంతిని కేజీబీవీ పాఠశాలలో చదివిస్తున్నారు. గత ఐదు సంవత్సరాల్లో అప్పటి ప్రభుత్వం కేజీబీవీ పాఠశాలల్లో అనేక మార్పులు తీసుకొచ్చిందని, ఆ మార్పులతోనే తాను ఉత్తమ ఫలితాలు సాధించినట్లు శ్రవంతి వెల్లడించింది.



సన్‌షైన్ అవార్డు స్వీకరిస్తున్న విద్యార్థిని శ్రవంతి, ఆమె తల్లిదండ్రులు

రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం



వారిది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం తండ్రి ట్రాక్టర్ డ్రైవర్.. తల్లి దినసరి కూలీగా కుటుంబాన్ని నెట్టుకొస్తూ తమ ముగ్గురి పిల్లలను పలమనేరులోని సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్‌లో పెట్టి చదివించారు. తల్లిదండ్రుల కష్టాలను చూసిన వారు కష్టపడి చదువుతూ తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెడుతున్నారు. వీరిలో పెద్దకుమార్తె తోటి హర్షిత స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో లైవ్‌స్టాక్ మేనేజ్‌మెంట్ అండ్ డెయిరీ టెక్నాలజీ కోర్సులో వెయ్యికి 971 మార్కులను సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వం ఇంటర్ ఫలితాల్లో వివిధ గ్రూపుల్లో టాపర్‌లుగా నిలిచిన 54 మందిని రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా షైనింగ్‌స్టార్ అవార్డుకు హర్షిత ఎంపికై విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరించింది.

టీచర్ కావాలన్నదే లక్ష్యం



టీచర్ కావడమే తన లక్ష్యం అని నడుమూరు మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం టాపర్ ఎస్.అశ్విని అంటోంది. అశ్విని రాష్ట్ర మోడల్ పాఠశాలల్లో సీఈఎస్ గ్రూపులో 969 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. తాను ఒకటి నుంచి పదో తరగతి వరకు కుప్పంలోని ఆర్‌పేట పాఠశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాని చెప్పింది. ఇంటర్మీడియట్ కుప్పం మండలం, నడుమూరు పాఠశాలలో చదువుతూ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సీఈసీలో 969 మార్కులు సాధించానంది. ఉపాధ్యాయులు బోధనతోనే ఇది సాధ్యమని చెప్పింది. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా టీచర్ కావాలని ఆకాంక్షిస్తోంది.

జిల్లా జడ్జిగా అరుణ సారిక బాధ్యతల స్వీకరణ



చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అరుణ సారిక శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. చిత్తూరులోని జిల్లా కోర్టులోని ఛాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన న్యాయమూర్తుల బదిలీల్లో మచిలీపట్నం జిల్లా జడ్జిగా పనిచేస్తున్న అరుణ సారికను చిత్తూరు జిల్లా జడ్జిగా నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. చిత్తూరులో పనిచేస్తున్న ఇ.భీమారావును అనంతపురం జిల్లా జడ్జిగా బదిలీ చేశారు.

నేడు జిల్లాలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 19వ తేదీన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శుక్రవారం ఆయన క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈ నెల 19వ తేదీన పారిశుద్ధ్యం పరిశుభ్రతను పెంపొందించేందుకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఇ -వేస్ట్ అనే ప్రధాన అంశంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇ- వేస్ట్ అంటే అన్ని మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలలోని గృహాలు, దుకాణాల్లో ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పూర్తిగా సేకరించి, రీయూజ్ చేయడమని తెలిపారు. ఇందుకు షాపులు, ఇళ్లల్లో ఉన్న ఎలక్ట్రానిక్ వేస్టును పూర్తిగా సేకరించాలనన్నారు. ఈ వేస్ట్‌ని సేకరించేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు బాధ్యతలు అప్పగించామన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ శాఖలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించి వెబ్‌సైట్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ వద్దని రోడ్డెక్కిన ముస్లింలు



పుంగనూరులో వక్ఫ్ బోర్డు బిల్లుకు నిరసనగా ర్యాలీ చేస్తున్న ముస్లింలు

పుంగనూరు: వక్ఫ్ చట్ట సవరణ వద్దని ముస్లింలు పుంగనూరులో శుక్రవారం రోడ్డెక్కారు. కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తిరస్కరిస్తున్నామని, తమ సత్తా చాటుతామని, రాజీపడే ప్రసక్తే లేదని ముస్లింలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వందలాది మంది ముస్లింలు నమాజ్ పూర్తి చేసుకుని, ర్యాలీగా పట్టణంలోని ఇందిరా సర్కిల్ చేరుకున్నారు. నల్ల జెండాలు, ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యదేశంలో మతాలకార్చిచ్చుకు ప్రభుత్వమే పునాది వేస్తోందని ముస్లిం నేతలు మండిపడ్డారు. హిందు మతానికి చెందిన వాటిలో ముస్లింలకు సభ్యత్వం ఉండదని, అలాంటి నిబంధనలు ఉన్న సమయంలో ముస్లింలపైన, వారి ఆస్తులపైన అన్యమతస్తులకు పెత్తనం చెలాయించేందుకు అధికారం ఎలా ఇస్తారంటు నిలదీశారు. ప్రభుత్వం ఈ విషయంపై చర్యలు తీసుకుని, వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని, లేకపోతే ఐకమత్యంతో పోరాటం చేసి, సాధించుకుంటామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో ముస్లిం నాయకులు ముజాహిద్, యూనస్, జవహార్, అయాజ్, మమ్ము, జమీర్, రఫిక్, నూర్, అయూబ్, అస్లాం, ఎస్.రఫిక్, ఇమ్రాన్, సల్మాన్, పర్వేజ్, యాసిన్, నజీర్ తో పాటు వక్ఫ్ బోర్డు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



కిక్కిరిసిన భక్తులు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు పోటెత్తారు, సెలవు దినం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్రదర్శనంతో పాటు వీఐపీ దర్శన క్యూలు భక్తులతో కిటకిటలాడాయి. దర్శన ఏర్పాట్లను ఆలయాధికారులు పర్యవేక్షించారు.

టీటీడీకి పది టన్నుల కూరగాయలు



కూరగాయలు పంపుతున్న వాహనానికి పూజ చేస్తున్న దాత, శ్రీవారి సేవకులు

పలమనేరు: పట్టణానికి చెందిన మార్కెట్ మండీ యజమాని ఓకేఆర్ రెడ్డెప్పరెడ్డి టీటీడీ నిత్యాన్నదాన సత్రానికి పది టన్నుల వివిధ రకాల కూరగాయలను టీటీడీ ప్రత్యేక వాహనంలో స్థానిక మార్కెట్ నుంచి శుక్రవారం పంపించారు. ఈ సందర్భంగా ఆ వాహనంలో కూరగాయలు నింపి, పూజలు చేసి, గోవిందనామ స్మరణల నడుమ వాహన్నాన్ని తిరుమలకు పంపారు. ఇందులో స్థానిక శ్రీవారి సేవకుడు కాబ్బల్లి రవీంద్రారెడ్డితోబాటు ఆయన మిత్రబృందం పాల్గొన్నారు.

జీసస్ మార్గం.. పాపహరణం



శిలువధారియైన యేసుక్రీస్తు, ఆ ప్రభువుకు శిలువ వేసిన రోమన్ సైనికులున్న ఈ దృశ్యం ప్రపంచ మానవాళి పాపవిముక్తి కోసం శిలువలో తనని తాను అప్పగించుకున్న క్రీస్తును స్ఫురణకు తెస్తుంది మాధవనగర్ బ్లెసింగ్ చర్చిలో క్రైస్తవులు ప్రదర్శించిన లఘునాటిక. గుడ్‌ఫ్రైడే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. క్రీస్తుత్యాగం.. సర్వమానవాళికి పాపహరణం జరిగిందని స్తుతించారు.

\- బంగారుపాళెం

క్లుప్తంగా

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు


డ్వామా పీడీ రవికుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి అర్హత, ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2025–2026 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం, ఉద్యాన శాఖ సంయుక్తంగా పండ్ల తోటల పెంపకం పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఐదువేల ఎకరాలలో పండ్ల తోటల పెంపకం చేపడుతున్నామన్నారు. మామిడి, జామ, కొబ్బరి, దానిమ్మ, అల్ల నేరేడు, చింతకాయ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, జామ, జామ (బ్లాక్, బండ్), సీతాఫలం (బ్లాక్, బండ్), యాపిల్ బెర్రీ, కొబ్బరి, మల్లె పూలు, రోజా, మునగ, ఆయిల్‌పామ్, జీడిపప్పు, తైవాన్‌జామ, అంజీర, చింత, బండ్ ప్లాంటేషన్ తదితర పండ్ల మొక్కలు పెంపకం చేపట్టవచ్చన్నారు. అలాగే పూల సాగుకు సంబంధించి మల్లె, రోజా పంటలపై ఆసక్తిగల రైతులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన చిన్న, సన్నకార రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండల పరిధిలోని ఉపాధి హామీ పథక కార్యాలయంలో దరఖాస్తులు చేసుకునేలా వెసులుబాటు కల్పించామన్నారు.

పూడి రైల్వే గేట్ వద్ద స్తంభించిన ట్రాఫిక్


రైల్వేగేటు వద్ద ఆగివున్న భారీ లారీ

వడమాలపేట (విజయపురం): పూడి రైల్వే గేటు వద్ద శుక్రవారం గేటు దాటే క్రమంలో అటువైపు వచ్చిన లారీ పైభాగం ప్రమాద ఘంటికలు సూచించే పైపునకు తగులుకోవడంతో ముందుకు వెళ్లలేక ఆగిపోయింది. దీంతో వాహనాలు రోడ్డుపై చాలావరకు ఆగిపోయాయి. వెంటనే రైల్వే సిబ్బంది స్టేషన్ మాస్టర్‌కు తెలపడంతో అక్కడకు చేరుకున్న రైల్వే సిబ్బంది ప్రమాద ఘంటికల సూచీని తొలగించడంతో లారీ ముందుకు కదిలింది. ఆ తర్వాత ట్రాఫిక్ క్లియరైంది.

ఉపాధికి షార్ట్‌కట్



పది పరీక్షలు ముగిశాయి.. ప్రభుత్వ కళాశాలల్లో అరకొర సౌకర్యాలు.. అందని మాధ్యమిక విద్య..ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ అంటే రూ.లక్షల వ్యయం .. ఎలా చేయాలని చింతిస్తున్నారా?. అవసరం లేదు. తక్కువ సమయం, ఖర్చుతో ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సు చేస్తే ఉన్నత ఉద్యోగం.. వద్దనుకుంటే ఉన్నత విద్యకు మార్గం సుగమం.. భవితకు భరోసా. ఉన్నత జీవనానికి చింతలేనిది పాలి‘టెక్నిక్’. అందులోనూ అతి వల ఉజ్వల భవితకు షార్ట్ కట్. దీనిపై ప్రత్యేక కథనం.

- పది తర్వాత కొలువుకు దగ్గర మార్గంలా పాలిటెక్నిక్ కోర్సులు
- డీసీసీపీ కోర్సుతో ఉద్యోగ అవకాశాలు మెండు
- శ్రీహరికోట షార్‌లో మంచి డిమాండ్
- అప్రెంటిస్‌షిప్ పూర్తితో ప్రైవేటు రంగాల్లో ఆఫర్లు


డీసీసీపీ కోర్సులో కంప్యూటర్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినిలు


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం(ఫైల్)

పలమనేరు: పాలిటెక్నిక్ కోర్సులు పదో తరగతి తరువాత తక్కువ ఖర్చు, సమయంలో ఉపాధి అవకాశాలు పొందడానికి దోహదపడతాయి. ఈ నేపథ్యంలోనే పదో తరగతి పూర్తయ్యాక పాలిసెట్ రాసే విద్యార్థులు.. పాలిటెక్నిక్ అంటే బీటెక్‌కు సులభమైన దారిగానే భావిస్తుంటారు. చాలామంది ఈ కోర్సులో బ్రాంచ్‌లైన సివిల్, మెకానికల్, ఈసీఈ, ఈఈఈ, సీఎస్‌ఈ వైపే చూస్తుంటారు. స్పెషల్ కోర్సులను పట్టించుకోరు. కానీ, ఇవే త్వరగా ఉపాధి పొందేందుకు సోపానాలు అని తెలుసుకోవడం లేదు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు పూర్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపే వారికి మంచి అవకాశాలుంటాయి. ఇప్పటికే ఈ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 30వ తేదీన పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. ర్యాంకు వచ్చిన బాలికలు పలమనేరు, నెల్లూరులోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలల్లోని కొన్ని కోర్సులు చేస్తే 19 ఏళ్లకే షార్‌లో ఉద్యోగం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

డీసీసీపీ అంటే ఏమిటి?

డీసీసీపీ.. కామర్స్‌తోపాటు పూర్తిస్థాయి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని నేర్పే మూడేళ్ల డిప్లొమా కోర్సు. ఇందులో కామర్స్, డిగ్రీ మొదటి సంవత్సరం ఇంగ్లిష్, ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్, హయ్యర్, మోడరన్ ఆఫీస్ మేనేజ్‌మెంట్, బిజినెస్ కరస్పాండెన్స్, స్టాటిటిక్స్, బిజినెస్ లా, మార్కెటింగ్ ప్రిన్సిపుల్స్, అనలటికల్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, డీటీపీసీ, టాలీ ప్రోగ్రామింగ్స్ ఉంటాయి. కోర్సులో ఏడాది అప్రెంటిస్‌షిప్ తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విస్తృత అవకాశాలున్నాయి. కోర్సు పూర్తి చేసిన వారు బీకాం కంప్యూటర్స్ డిగ్రీలో లేటరల్ అడ్మిషన్ కింద సెకండ్ ఇయర్‌లో చేరవచ్చు. ఆపై ఎంబీఏ, సీఏ, సీఎస్ లాంటి ఉన్నత కోర్సులు చదవచ్చు.

- తల్లిదండ్రులు ఇలాంటి కోర్సులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

ఎస్వీయూ రీజియన్‌లో..

శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో మొత్తం 84 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వీటిలో 26 ఇంజినీరింగ్ కోర్సుల్లో 85 వేల సీట్లు ఉన్నాయి. ప్రతి కోర్సులో 60 సీట్లు ఉంటాయి. కోర్ బ్రాంచ్‌లు పోగా స్పెషల్ కోర్సులుగా కళాశాలల ఆధారంగా ఐటీ, బయో మెడికల్, షుగర్ టెక్నాలజీ, లెదర్ టెక్నాలజీ, టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంట్స్, సిరామిక్, ఆర్కిటెక్చర్, మెటాలజీ తదితర కోర్సులున్నాయి.

- విద్యార్థినులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే డీసీసీపీ నెల్లూరు, పలమనేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే అందుబాటులో ఉంది.

షార్‌లో ట్రైనింగ్.. ప్రొఫైల్ చూసి అసెంచూర్‌లో జాబ్



పలమనేరులోని పాలిటెక్నిక్ కళాశాలలో డీసీసీపీ కోర్సు చదివి శ్రీహరికోటలో ఏడాది పాటు అప్రెంటిస్‌షిప్ చేశా. నా ఈ ప్రొఫైల్ చూడగానే ఇంటర్వ్యూలో బెంగళూరులోని అసెంచూర్ సంస్థలో ఉద్యోగం దక్కింది. పీ2పీ (ప్రొక్యూర్‌మెంట్ టు పే న్యూ అసోసియేషన్)గా మంచి ప్యాకేజీతో జాబ్ చేస్తున్నా. పలమనేరులో ఇలాంటి కోర్సులున్నాయని చాలామందికి తెలియదు. – హేమావతి, బెంగళూరు

బాలికలకు ప్రత్యేక పాలిటెక్నిక్

చిత్తూరు జిల్లా పలమనేరు, నెల్లూరులో ప్రత్యేకించి మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వీటిలో డిప్లొమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ (డీసీసీపీ) కోర్సు చేసినవారు ఏటా తిరుపతి జిల్లా శ్రీహరికోట షార్‌లో కంప్యూటర్ అనలిస్ట్‌గా అప్రెంటిస్‌షిప్‌నకు ఎంపికవుతున్నారు.

- షార్‌లోనే కాక ఎన్‌ఆర్‌ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, హైదరాబాద్) హెచ్‌ఏఎల్ (హిందూస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్) వంటి పేరుగాంచిన కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నారు.
- వీటిలో అప్రెంటిస్‌షిప్‌తో నైపుణ్యం సాధించిన వారికి ప్రైవేట్ రంగంలోని ప్రముఖ కంపెనీలు భారీ వేతనాలను ఆఫర్ చేస్తున్నాయి.
- పలమనేరులోని కళాశాలలో డీసీసీపీ కోర్సు పూర్తి చేసుకున్న 90 శాతం మందికి ఏటా వెంట నే ఉపాధి లభిస్తోంది. పదేళ్లలో వివిధ కోర్టులు, రాష్ట్ర సచివాలయం, పోస్టల్, ప్రైవేటు బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో 400 మంది దాక ఉద్యోగాలు పొందడం విశేషం.

టెన్త్ తర్వాత మంచి కోర్సు



పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాలిసెట్ ర్యాంకు ఆధారంగా పలు కోర్సుల్లో చేరే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో చక్కటి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. పేద, మధ్యతరగతి పిల్లలకు పాలిటెక్నిక్ విద్య ఎంతో మేలు. తద్వారా బీటెక్‌లోనూ ప్రవేశించి ఉన్నత విద్య అభ్యసించవచ్చు.
– డా.బిహారా శ్రీనివాస్, ప్రిన్సిపల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పలమనేరు

ఇక్కడ చదివితే జీవితంలో సెటిల్



కోర్ బ్రాంచ్‌లే కాదు స్పెషల్ బ్రాంచ్‌ల్లో చదివినవాళ్లు మంచి ఉపాధి అవకాశాలను పొందవచ్చు. డీసీసీపీ కోర్సు చేసిన చాలామంది షార్ లాంటి గొప్ప సంస్థల్లో ఉద్యోగాల్లో ఉన్నారు. కొందరు ఉన్నత చదువులకు వెళుతున్నారు. పాలిటెక్నిక్‌లోని ఇలాంటి కోర్సుల గురించి చాలామందికి తెలియదు.
– మహమూద్, సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ హెడ్, పలమనేరు

ఏటా పది మందిపైనే షార్‌లో శిక్షణకు..



ఏటా షార్‌కు ఇక్కడినుంచి పదిమంది పైగా విద్యార్థినులు శిక్షణకు వెళుతున్నారు. ఆపై ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఈసారి సైతం ఇక్కడ చదివిన సిమ్రాన్ (సదుం), డిల్లీ (బంగారుపాళెం), శశిప్రియ (నిమ్మనపల్లి), భవాని (గుడుపల్లి) పలువురు షార్‌లో పనిచేస్తున్నారు.
– శ్రీవిద్య, డీసీసీపీ డిపార్ట్‌మెంట్ హెడ్, పలమనేరు

వరసిద్ధుని సేవలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కాణిపాకం: వరసిద్ధి వినాయక స్వామివారిని శుక్రవారం చిత్తూరు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ సారిక దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆమె స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. వారికి ఆలయాధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండ పాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని దర్శించుకున్న రాష్ట్ర కమిషన్

వరసిద్ధి వినాయక స్వామివారిని రాష్ట్ర శిశు, చిన్నపిల్లల సంక్షేమ కమిషన్ కేసలి అప్పారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయాధికారులు ఘన స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు వారికి ఆశీర్వచనాలు పలికి, స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. అనంతరం స్థానిక మణికంఠే శ్వరస్వామి, వరదరాజుల స్వామిని దర్శించుకున్నారు.



జిల్లా జడ్జి అరుణ సారిక, కేసరి అప్పారావుకు వరసిద్ధుడి చిత్రపటం అందజేస్తున్న ఆలయాధికారులు

కూటమి దురాగతాలను ఎండగట్టాలి


మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

–మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: కూటమి దురాగతాలను ఎండగట్టాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆళ్ల మడుగులో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. పది నెలలుగా సూపర్‌సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటీ అమలు చేయని దౌర్భాగ్య పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని చెప్పారు. పథకాలను అమలు చేయాలని అడిగితే అక్రమ కేసులతో అణచివేతకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తానే తప్పు చేస్తూ ప్రతిపక్ష పార్టీపై నెట్టి వారిపైనే నిందలు, అభాండాలు వేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అరాచకాలకు హద్దు ల్లేవన్నారు. పేదల ఉసురు తగిలితే ఎలాంటి పార్టీ అయినా కోలుకోలేదన్నారు. రాష్ట్రంలో డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, దురాగతాలను ఎండగట్టేందుకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల తలరాతలు మారాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు రమణమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి, మండల ఉపాధ్యక్షులు చిరంజీవిరెడ్డి, గోవిందన్, కార్యదర్శులు బొజ్జారెడ్డి, కేశవులు, వెంకటేశ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పురుషోత్తం పాల్గొన్నారు.

చెరువులో పడి అవ్వామనవడి మృతి


మృతి చెందిన మునెమ్మ, జయప్రదీప్

గుడుపల్లె: పశువులను కడిగేందుకు చెరువులోకి వెళ్లి అవ్వామనవడు మృతి చెందిన సంఘటన గుడుపల్లె మండలం బిజిగానిపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని బిజిగానిపల్లె గ్రామానికి చెందిన మునెమ్మ(65) ఆమె మనుమడు జయప్రదీప్(14) గ్రామానికి సమీపంలోని నాగరప్ప చెరువులోకి తమ పశువులను కడగడానికి తీసుకు వెళ్లారు. పశువులను చెరువులో కడుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ఇద్దరు లోతుగా ఉన్న నీటి కుంటలో పడి మృతి చెందారు. స్థానికులు గమనించి వెంటనే చెరువులోకి వెళ్లి చూడగా వారి మృతి చెందారు. జయ ప్రదీప్ 9వ తరగతి చదువుతున్నారు. సెలవులలో ఇంటి వద్ద ఉండి చెరువులో పడి మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి.

లారీని ఢీకొన్న ఐషర్ వాహనం


ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఐషర్ వాహనం

శ్రీరంగరాజపురం : ఆగి ఉన్న లారీని ఐషర్ వాహనం ఢీకొన్న సంఘటన మండలంలోని పెద్దతయ్యూరు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గురువారం రాత్రి పళ్లిపట్టు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ఐషర్ వాహనం మండలంలోని పెద్దతయ్యూరు వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఐషర్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఐషర్ వాహనం ముందు భాగం పూర్తిగా దెబ్బతినింది. అయితే ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

అగ్నిప్రమాదాలు సమయస్ఫూర్తితో నివారించాలి

చిత్తూరు కలెక్టరేట్ : అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఆందోళన, కంగారు చెందకుండా సమయస్ఫూర్తితో నివారించాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లు, డెయిరీ, పరిశ్రమల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు చోటు చేసుకున్న వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అప్రమత్తంగా ఉంటే అగ్నిప్రమాదాలకు సులువుగా అడ్డుకట్ట వేయవచ్చన్నారు. అడిషనల్ అగ్నిమాపక శాఖ అధికారి కరుణాకర్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారోత్సవాల్లో ప్రచారం చేస్తున్నామన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలను చైతన్యవంతులను చేయడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం పెట్రోల్ బంకుల్లో, పాల డెయిరీల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ లీడ్ ఫైర్‌మెన్‌లు ఏసుపాదం, శోభన్, సిబ్బంది రాజు, గిరిబాబు, కుశలన్, నవీన్‌లు పాల్గొన్నారు.

అర్ధరాత్రి తనిఖీలు.. 31 కేసులు నమోదు

– పాల్గొన్న ఎస్పీ మణికంత

చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఆదేశాలతో జరిగిన తనిఖీల్లో మొత్తం 31 కేసులు నమోదు చేశారు. చిత్తూరు నగరంలో అర్ధరాత్రి ఎస్పీ మణికంత రోడ్లపైకి వచ్చి తనిఖీల్లో పాల్గొన్నారు. మురకంబట్టు, సాంబయ్యకండ్రిగ కూడళ్లల్లో పోలీసులతో కలిసి ఎస్పీ తనిఖీలు చేశారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలను సీజ్ చేశారు. అలాగే రెడ్డిగుంట కూడలి వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఇక బంగారుపాళెం వద్ద కర్ణాటక మద్యం తీసుకెళుతున్న కారును పట్టుకున్నారు. జిల్లా మొత్తంగా సరైన పత్రాలులేని ఎనిమిది వాహనాలను స్వాధీనం చేసుకోగా, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురు, మైనర్ డ్రైవింగ్ కేసులో ఒకరు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినందుకు ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్లపై పోలీసులు నిత్యం కనిపించాలనే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి కొనసాగుతాయని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

చిన్నపనైనా.. చేయి తడపాల్సిందే!

- అవినీతికి అడ్డాగా చిత్తూరు రెవెన్యూ కార్యాలయం
- నకిలీ పత్రాలకు కేంద్ర బిందువు
- గోలును పడితే కాసులు
- పట్టాలంటే పైసలతోనే పని
- ప్రతి పనికి బహిరంగంగా వసూలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డగా మారింది. నకిలీ పత్రాల తయారీకి కేంద్ర బిందువుగా పేరు తెచ్చుకుంది. ప్రతి పనికీ బహిరంగంగా కాసులు వసూలు చేస్తున్నారు. పట్టా ఇవ్వాలన్నా.. సర్వే చేయాలన్నా లంచాలు ఇవ్వాల్సివస్తోంది. చిత్తూరు నగరం మిట్టూరులో అర్బన్, వేలూరు రోడ్డులో రూరల్ తహసీల్దార్ కార్యాలయాలున్నాయి. ఇక్కడకి నిత్యం 200 మందికిపైగా వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. సర్వే, పట్టాదారు పాసుపుస్తకం, మార్పులు, సర్వే నంబర్లల్లో తప్పులు తదితర సమస్యల పరిష్కారానికి వస్తుంటారు. వీరి అవసరాలను అసరా చేసుకుని కొందరు అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారు.

దొంగ పట్టాలకు కేంద్ర బిందువు

చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కేంద్రం దొంగ పట్టాలకు కేంద్ర బిందువుగా మారింది. తప్పుడు పత్రాలు సృష్టించి కొందరు అధికారులు, సిబ్బంది, దళారులు కాసులు దండుకుంటున్నారు. ప్రశాంత్‌నగర్, తిమ్మసముద్రం, ఇరువారం, తదితర ప్రాంతాల్లో పట్టా ఉన్న స్థలాలకు మళ్లీ డూప్లికేట్ పట్టాలు సృష్టించి ఇచ్చేస్తున్నారు. ఇందులో ఇదివరకు పని చేసిన తహసీల్దార్లు, విశ్రాంత తహసీల్దార్ల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. వారు పనిచేసిన తేదీల్లో పట్టా ఇచ్చినట్లు పత్రాలు సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి తప్పుడు పత్రాలు వేలల్లో ఉన్నట్లు అధికారుల అంచనా.

సర్వేకూ సమర్పించుకోవాల్సిందే!

ప్రస్తుతం సర్వేకు సంబంధించిన సమస్యలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. దీని ఆసరాగా చేసుకుని కొందరు సర్వేయర్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. సర్వేకు డబ్బులు..కట్టినా, కట్టపోయినా కాసులిస్తే వాలిపోతున్నారు. కొందరు నగదు రూపేణ తీసుకుంటే..మరికొందరు ఫోన్‌పే, జీ పే ద్వారానే కాసులు వసూలు చేసుకుంటున్నారు. ఇదంతా సాయంత్రం 6 గంటల తర్వాతే జరుగుతుంటాయి.


చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం వచ్చిన జనం

- చిత్తూరు నగరంలోని ఓ గ్రామకంతం భూమిలో పూర్వీకులు ఇల్లు కట్టుకున్నారు. వాటికి ఎలాంటి డాక్యుమెంట్లు లేవు. కానీ వంశపారపర్యంగా వారు ఆ గ్రామ కంతం భూమిలోనే నివాసం ఉంటున్నారు. ఉన్న పాత ఇల్లు కొట్టేసి..కొత్త ఇల్లు కట్టుకోవాలంటే పొజిషన్ అవసరం. కానీ రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారు.
- చిత్తూరులోని మరో చోట గ్రామకంత భూమి ఖాళీగా ఉంది. ఆ భూమి తమ అనుభవంలోనే ఉందని ఇద్దరు వ్యక్తులు కార్యాలయానికి వచ్చారు. పక్కాగా పని చేసి పెట్టేవారిని పట్టుకున్నారు. ఇంకేముంది మూడు రోజుల్లో ముచ్చటగా చేతిలో పొజిషన్ పెట్టేశారు. తీరా వారు అడిగినంత ఇచ్చుకున్నట్లు సమాచారం.
- చిత్తూరు నగరానికి చెందిన ఓ భూమి రకం తప్పుగా నమోదైంది. దాన్ని మార్చుకుని కన్వర్షన్ పెట్టుకునేందుకు భూ యజమాని ఆరునెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. తొలుత భూమి సబ్ డివిజన్ కోసం ఓ సర్వేయర్‌కు రూ. 20 వేలు ఇచ్చుకున్నాడు. అయినా ఇంత వరకు పని కాలేదు.
- చిత్తూరు మండలంలోని ఓ రైతు సర్వే చేసి హద్దులు చూపించుకునేందుకు ఓ సర్వేయర్‌కు రూ.60వేలు ఇచ్చుకున్నాడు. ఆ పనికాకపోవడంతో ఆ రైతు కొన్ని నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఆ సర్వేయర్‌ను అదనపు పనుల నిమిత్తం వేరే ప్రాంతానికి మార్చడంతో ఆ రైతు విస్తుపోతున్నాడు. ఇలా ఓ టీడీపీ కార్యకర్త కూడా రూ.10 వేలు ఇచ్చుకున్నా సర్వే కాలేదు. దీంతో అధికారంలో ఉండి కూడా ఏందీ తంటా అంటూ ఆ కార్యకర్త తల పట్టుకుంటున్నాడు. ఇలాంటి కేసులు ఇదొక్కటే కాదు..పదుల సంఖ్యలో వస్తున్నాయి.

పనుల ఆధారంగా లంచం

రెవెన్యూలో ప్రతి పనికీ కొందరు అధికారులు నిర్భయంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. పట్టామార్పునకు స్థలం, దాని విలువ ఆధారంగా వసూలు చేస్తున్నారు. సాధారణ ఫీజుగా రూ.20 వేలుగా ఫిక్స్ చేశారని విమర్శలు వస్తున్నాయి. సర్వే నంబర్లలో తప్పులు సరిదిద్దుకునేందుకు రూ.10 వేలు అడుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆన్‌లైన్‌లో దొర్లిన తప్పులు సరిదిద్దడానికి రూ.10వేలు, కరెంటు సర్వీసు రూ.10 వేలు, సబ్ డివిజన్ చేసుకునేందుకు ఎంత డబ్బులిస్తే అంత తొందరగా పనులు అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.